## క్లుప్తంగా

### కొవ్వొత్తుల ర్యాలీలో బీఆర్ఎస్ నేతలు



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

**ఎదులాపురం:** హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. గన్‌పార్క్ వద్ద అమర వీరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం ట్యాంక్‌బండ్ అమరజ్యోతి వరకు కొనసాగిన ర్యాలీలో పాల్గొన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, పార్టీ సీనియర్ నాయకులు నల్ల రాజేశ్వర్, ఉమాకాంత్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానం



రక్తదానం చేస్తున్న రోహిత్

**ఎదులాపురం:** బేల మండలం మాంగ్రూడ్ గ్రామానికి చెందిన టేకం రత్నమాల రక్తహీనత బాధపడుతోంది. చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేరగా ×ఏ పాజిటివ్‌బ్లడ్ అత్యవసరంగా కావాలని వైద్యులు సూచించగా, కుటుంబీకుల ద్వారా విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి స్పందించారు. ఆదిలాబాద్‌లోని కైలాస్‌నగర్‌కు చెందిన రోహిత్‌తో రక్తదానం చేయించారు. యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### నీరు లేక ఆవు మృతి!



మృతిచెందిన ఆవు

**నేరడిగొండ:** మండలంలోని దర్బతండా సమీపంలో ఓ ఆవు శనివారం మృతిచెందింది. ఆ గ్రామానికి చెందిన రాథోడ్ గోవింద్ వెళ్తుండగా ఆవు చనిపోయి ఉండడంతో గ్రామస్తులకు సమాచారం అందించాడు. ఇది గ్రామానికి చెందిన ఆవు కాదని గ్రామస్తులు తేల్చారు. అయితే మేత మేయడానికి వచ్చి వాగుతోపాటు నీటి తొట్లెల్లో నీళ్లు లేకపోవడంతో మృతిచెంది ఉండవచ్చని వారు తెలిపారు.

### సత్యనారాయణ వ్రతంలో మాజీమంత్రి దంపతులు



పాల్గొన్న జోగురామన్న దంపతులు

**ఎదులాపురం:** మాజీమంత్రి జోగురామన్న ఇటీవల మహారాష్ట్రలో పండరీపూర్ విఠలేశ్వర తోపాటు పలు ఆలయాలను దర్శించుకున్నారు. ఆదిలాబాద్ చేరుకున్న ఆయన శనివారం శాంతినగర్‌లోని తన నివాసంలో నిర్వహించిన సత్యనారాయణ వ్రతంలో సతీమణి రమాదేవితో కలిసి పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని స్వామిని వేడుకున్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

### శ్రమదానం



బావిని శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

**నార్నూర్:** గత వారం క్రితం గాదిగూడ మండలంలోని లోకారి(బి) గ్రామంలో కలుషిత నీటిని తాగి 20 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. శనివారం గ్రామస్తులు అందరు కలిసి తాగునీటి బావిని శ్రమదానం చేసి శుద్ధిచేశారు. నీటిని బయటకు తీసి బావిలో చెత్తను తొలగింపజేశారు.

### సన్మానం

**తలమడుగు:** తలమడుగు, బరంపూర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం అయోధ్య బాలరామునికి పాదుకలు చేసిన హైదరాబాద్‌కు చెందిన శిల్పి రామచంద్రచారిని ఆలయ కమిటీ సభ్యులు శనివారం సన్మానించారు. ఆలయాల్లో దేవతమూర్తులకు ఆభరణాలు చేయడానికి వచ్చిన శిల్పిని గ్రామస్తులు సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంద్రాసేనారెడ్డి, ఉపాధ్యక్షుడు మంథే రమేశ్, కటిపెల్లి రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

# పచ్చదనం కరువు..

- మూణ్నాళ్ల ముచ్చటగా వాటర్‌ఫౌంటేన్
- కళావిహీనంగా ప్రధాన చౌక్‌లు
- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా



జగ్జీవన్‌రాంచౌక్‌లో ఎండిపోయిన ల్యాన్

**కైలాస్‌నగర్:** ఆదిలాబాద్ పట్టణం బల్దియా అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిగా కళతప్పింది. పట్టణ సుందరీకరణలో భాగంగా కోట్లాది రూపాయలు వెచ్చించి ఇటీవలనే జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌక్‌లను ఆకట్టుకునేలా అందంగా ముస్తాబు చేశారు. పచ్చని పచ్చిక బయళ్లతోపాటు ప్రజలను ఆకర్షించేలా వివిధ కళాకృతులను తీర్చిదిద్దారు. రకరకాల మొక్కలు ఏర్పాటు చేశారు. రహదారి గుండా వెళ్లే ప్రజలకు ఆహ్లాదం పంచేలా వాటర్ ఫౌంటేన్లను ఏర్పాటు చేశారు. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం, బల్దియా అధికారుల నిర్లక్ష్యంతో ఇదంతా మున్నాళ్ల ముచ్చటగానే మారింది. నిర్వహణ లోపంతో ప్రధాన చౌక్‌లన్నీ పూర్తిగా కళ తప్పాయి. ఫలితంగా లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది.

**కోట్ల రూపాయల వెచ్చింపు**

గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాల్టీలోని పురాతనమైన చౌక్‌లను సుందరీకరించాలనే ఉద్దేశంతో మున్సిపల్ అధికారులు పాత చౌక్‌లు తొలగించి వాటి స్థానంలో కొత్తగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఇందుకోసం కోట్లాది రూపాయలు వెచ్చించి అంబేద్కర్‌చౌక్, వినాయక్‌చౌక్, ఎన్టీఆర్ చౌక్, కలెక్టర్‌చౌక్, జగ్జీవన్‌రాం చౌక్‌లను సుందరంగా తీర్చిదిద్దారు. అన్నిచౌక్‌ల్లోనూ పచ్చని పచ్చిక బయళ్ల(ల్యాన్)లను ఏర్పాటు చేశారు. ప్రజలను ఆకట్టుకునేలా రకరకాల అరుదైన పూల మొక్కలు కొనుగోలు చేసి అలంకరించారు. పచ్చిక బయళ్లతో వివిధ రూపాలతో కూడిన కళాకృతులను తీర్చిదిద్దారు. ఒక్కో చౌక్ సుందరీకరణ కోసం రూ.28 లక్షల నుంచి రూ.కోటి వరకు వెచ్చించి ఆకట్టుకునేలా ముస్తాబు చేశారు. గతంలో ఇరుకుగా ఉన్నటువంటి ఎన్టీఆర్, అంబేద్కర్, కలెక్టర్‌చౌక్‌లను విశాలంగా మార్చారు.

**మూణ్నాళ్ల ముచ్చటగానే..**

కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన చౌక్‌ల సుందరీకరణ మూణ్నాళ్లముచ్చటగానే మారింది. బల్దియా అధికారుల పట్టింపులేనితనంతో అన్నిచౌక్‌ల్లో ఏర్పాటు చేసిన పచ్చిక బయళ్లు పూర్తిగా ఎండిపోయాయి. పూలమొక్కలు ఆనవాళ్లు లేకుండా కనుమరుగయ్యాయి. సుందరీకరణ కోసం ఏర్పాటు చేసిన రెయిలింగ్‌లు విరిగిపోతున్నాయి. ముఖ్యంగా ఎన్టీఆర్‌చౌక్‌లోని లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటేన్ నెల రోజులకే పనికిరాకుండా పోయింది. కలెక్టర్‌చౌక్‌లో పచ్చిక బయళ్లు, పూలమొక్కలు ఎండిపోయి శుక్రవారం ఎండల తీవ్రతతో మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్న టూటౌన్ పోలీసులు గమనించి మంటలార్పివేశారు. కాగా చౌక్‌ల సుందరీకరణపై పెట్టిన శ్రద్ధ వాటి నిర్వహణపై అధికారులు పెట్టలేదని ఫలితంగానే ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పచ్చదనమనే ఆనవాళ్లు కోల్పోయిన కలెక్టర్‌చౌక్



కలెక్టర్‌చౌక్‌లో ఎండిపోయిన మొక్కలు, పచ్చదనం



కలెక్టర్‌చౌక్‌లో ఎండిపోయిన గడ్డి, మొక్కలను చెత్త ఆటోలో తరలిస్తున్న బల్దియా సిబ్బంది

## మండలాల వారీగా విత్తనాల కేటాయింపు

**కైలాస్‌నగర్:** జిల్లాకు చేరిన రాశీ 659 విత్తన ప్యాకెట్లను మండలాల్లోని డీలర్ల వారీగా కేటాయించినట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. 27,936 విత్తన ప్యాకెట్లు రాగా వీటిని జిల్లాలోని 138 మంది డీలర్లకు కేటాయించినట్లు తెలిపారు. ఈ విత్తనాలు రైతులకు అందించేలా వ్యవసాయ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రైతులు ఈ విషయాన్ని గమనించి విత్తనాలు పొందాలని సూచించారు.



| మండలం | డీలర్లు | కేటాయించిన విత్తనాలు |
|---|---|---|
| ఆదిలాబాద్‌అర్బన్ | 40 | 13126 |
| బజార్‌హత్నూర్ | 03 | 384 |
| బేల | 17 | 2273 |
| భీంపూర్ | 07 | 1760 |
| బోథ్ | 09 | 1096 |
| ఇచ్చోడ | 14 | 1082 |
| గాదిగూడ | 02 | 77 |
| గుడిహత్నూర్ | 03 | 44 |
| ఇంద్రవెల్లి | 11 | 1337 |
| జైనథ్ | 08 | 2708 |
| నార్నూర్ | 04 | 328 |
| నేరడిగొండ | 05 | 768 |
| సిరికొండ | 03 | 332 |
| తలమడుగు | 08 | 1956 |
| తాంసి | 03 | 540 |
| ఉట్నూర్ | 01 | 125 |

## బడీడు పిల్లల్ని పాఠశాలల్లో చేర్చాలి

**నేరడిగొండ:** బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్చాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. మండలంలోని వడూర్ గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎవరైన బడికి వెళ్లని పిల్లలు ఉంటే వారిని పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన విద్యాబోధన ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరికొండ: బడీడు పిల్లలందరు పాఠశాలల్లో చేర్పించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో జెడ్పీ పాఠశాలలో ఎంపీడీవో బాల గంగాధర్ ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఎంపీవో సంతోష్, ఐకేపీ ఏపీఎం సంతోష్, కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద, ఏఎస్సై రమేశ్ పాల్గొన్నారు.

బడిబాట విజయవంతం చేయాలి

ఇచ్చోడ: బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ తుకారాం అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా హెచ్ఎంలు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఎంపీడీవో లక్ష్మణ్, ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు, ఎస్సై నరేశ్, పాఠశాలల హెచ్ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

**బోథ్:** మండల వ్యాప్తంగా బడిబాట కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. బోథ్, సొనాలతో పాటు పలు గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సొనాలలో హెచ్ఎం రడాపు మధుసూధన్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ వద్ద గల విద్యార్థులకు బడిలో చేర్పించాలని కోరారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పుస్తకాలు, ఉచిత యూనిఫాం, నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు.

## విత్తన దుకాణాలు తనిఖీ

**తలమడుగు:** మండలంలోని లింగి గ్రామంలో విత్తన దుకాణాలను ఏవో మహేందర్, ఏఎస్సై సురేందర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టార్లను ఏవో పరిశీలించారు. విత్తర ధరల స్టాక్ లభ్యత వివరాలు తెలిపే వివరాల బోర్డులను దుకాణాల ఎదుట పెట్టాలని సూచించారు. తప్పనిసరిగా,విత్తనాలు, మందులు గాని విక్రయించిన రైతులకు రసీదులు అందించాలని ఆదేశించారు. రసీదులు అందించని దుకాణాల వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఏఈఓ రమేశ్, రెవినా, డీలర్ ఉన్నారు.



తనిఖీ చేస్తున్న ఏవో , ఏఎస్సై

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

**ఇంద్రవెల్లి:** రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలతోపాటు కేసులు నమోదు చేస్తామని ఉట్నూర్ సీఐ మొగిలి హెచ్చరించారు. మెండపల్లి గ్రామంలో నకిలీ విత్తనాలు అమ్ముతున్నారనే సమాచారంతో శనివారం ఏఈవో కరుణతో కలిసి ముండే పరమేశ్వర్, ముండే యేశ్వంత్‌రావ్ రైతుల ఇళ్లలో తనిఖీ చేశారు. వారు కొనుగోలు చేసిన పత్తి విత్తనాలు పరిశీలించారు. అవి నకిలీ విత్తనాలు కావని ఏఈవో తెలిపారు.



పత్తి విత్తనాలు పరిశీలిస్తున్న సీఐ మొగిలి

## డీఎంహెచ్‌వోకు సన్మానం

**ఎదులాపురం:** బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌ను తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్–1 జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పారామెడికల్ సహాయ సహకారం, ఆరోగ్యశాఖలోని సిబ్బంది కృషితోనే ప్రజలకు మెరుగున వైద్య అందించామన్నారు. దీంతో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మంచి గుర్తింపు లభించిందన్నారు. ఎన్‌సీడీ కార్యక్రమ అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్పల్లి వార్, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండారి కృష్ణ, అల్లాడి రఘురాం, మహిళా విభాగం అధ్యక్షురాలు సంపత్ కుమారి, నాయకులు ప్రమోద్ కుమార్, హరీశ్, కుమార్, సచిన్, వివేక్, రమేశ్, విజయ్, నాగభూషణం, సాయికృష్ణ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్-1 జిల్లాశాఖ బాధ్యులు

## రుణాలు సకాలంలో చెల్లించాలి



బోథ్: రుణాల చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

**బోథ్:** స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు సకాలంలో రుణాలు చెల్లించి తిరిగి పొందాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రభుదాస్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 19 సంఘాలకు రూ.కోటి.50 లక్షలు రుణాల పంపిణీ, రుణమేళా కార్యక్రమానికి శనివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘ సభ్యులు బ్యాంకు నుంచి పొందుతున్న రుణాలను తీసుకొని స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం బోథ్ మండలంలో గ్రామీణ ప్రాంతాలలోని గిరిజన విద్యార్థినీ విద్యార్థులు 2023 2024 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ప్రథమ శ్రేణిలో గ్రేడ్ వన్ లో ఉత్తీర్ణులైనా 50 మంది విద్యార్థిని విద్యార్థులకు శాలువతో సన్మానించి, ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. బ్యాంక్ మేనేజర్ రాథోడ్ ప్రహ్లాద్, ఐకేపీ ఏపీఎం మాధవ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల తదితరులు పాల్గొన్నారు. .

**బ్యాంక్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి**

**ఇంద్రవెల్లి:** మహిళా సంఘాల సభ్యులు బ్యాంక్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ సీసీ దేవ్‌సింగ్ కోరారు. మండలంలోని వాల్గొండ గ్రామాన్ని శనివారం సందర్శించారు. ఇటీవల బ్యాంక్ రుణం తీసుకున్న మహిళా సంఘాలతో ఆయన సమావేశమయ్యారు. సకాలంలో రుణాలు చెల్లించి తిరిగి పొందాలని సూచించారు. కార్యక్రమంలో వీవోఏ దుర్వ కళబాయి, తదితరులు ఉన్నారు.



### రాంగ్ రూట్

జిల్లా కేంద్రంలో పలువురు వాహనదారులు ఇష్టారాజ్యాంగ డ్రైవింగ్‌కు పాల్పడుతున్నారు. రోడ్డు నిబంధనలు పాటించకుండా వ్యవధి, దూరం తగ్గుతుందని షార్ట్‌కట్‌లో వ్యతిరేక దిశలో ప్రయాణాలు చేస్తున్నారు. ఇలాంటి వారితో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, సరైన మార్గంలో వాహనాలు నడిపే వారికి ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. ఇలాంటివి చోటు చేసుకోకుండా ట్రాఫిక్ పోలీసులు కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

### 'నాణ్యత లేకపోతే బిల్లులు చెల్లించం'

**బోథ్:** చెక్‌డ్యాం నిర్మాణంలో నాణ్యత పాటించాలని నీటిపారుదల శాఖ డీఈ భీంరావ్ అన్నారు. మండలంలోని మర్లపెల్లి సమీపంలోని వాగుపై రూ.కోటి 50 లక్షలతో నిర్మిస్తున్న చెక్‌డ్యాం నిర్మాణ పనులను ఏఈ ప్రకాశ్ జాదవ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించకపోతే బిల్లులు చెల్లించేది లేదన్నారు. చెక్‌డ్యాం వల్ల నీటి లభ్యతతోపాటు భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. వెంట కాంట్రాక్టర్ ఉన్నారు.



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈ, ఏఈ

## సంక్షిప్త వార్తలు

**ఘనంగా హనుమాన్ జయంతి**

**బోథ్:** మండల కేంద్రంలోని పెద్దార్లగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో పెద్ద హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రామనామ సంకీర్తన చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. పండితులు సంతోష్, భక్తులు పాల్గొన్నారు.

**స్వాముల మాలవిరమణ**

**తాంసి:** మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు మాలవిరమణ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఇరుముడి కట్టుకుని కొండగట్టుతోపాటు పెండల్‌వాడ, హనుమాన్ ఆలయాలకు వెళ్లి మాల విరమణ చేశారు.

**భుక్యా జాన్సన్ దంపతులకు శుభాకాంక్షలు**

**నేరడిగొండ:** ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

**ఏజెంట్ల కమీషన్ పెంపుదల**

**బోథ్:** రాష్ట్రంలోని బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న కమిషన్ ఏజెంట్లకు చెల్లించే కమీషన్ రేటుపై యాజమాన్యాలతో శుక్రవారం జరిగిన చర్చలు సఫలమయ్యాయని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు గోవర్ధన్ తెలిపారు. రెండేళ్ల క్రితం యాజమాన్యాలతో కుదిరిన ఒప్పందం గత మార్చి 31తో ముగిసిందని అన్నారు. అనంతరం పెంపుపై బీడీ కమీషన్ ఏజెంట్లు, యాజమాన్యాల సంఘాల మధ్య నిజామాబాద్‌లో చర్చలు జరిగాయని, కమీషన్ రేటుపై అదనంగా రూ.4.50 చొప్పున పెంచేందుకు అంగీకారం కుదిరిందని తెలిపారు. ఈ ఒప్పందం 2024 ఏప్రిల్ 1 నుంచి రెండేళ్ల పాటు అమలులో ఉంటుందన్నారు.

**3 నుంచి పశువుల సంత మూసివేత**

**ఇచ్చోడ:** ఈనెల 3 నుంచి బక్రీద్ వరకు ప్రతీ సోమవారం నిర్వహించే ఇచ్చోడ పశువుల సంతను మూసివేస్తున్నట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**ఆర్థికసాయం అందజేత**

**నేరడిగొండ:** మండలంలోని బుగ్గారం గ్రామానికి చెందిన జాదవ్ మహేష్ కుమారుడు అనారోగ్యంతో ఆదిలాబాద్ రిమ్స్‌లో చేరాడు. కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జాదవ్ వసంత్‌రావు శనివారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు గడ్డం నరేశ్‌రెడ్డి, రాంలక్ష్మణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

**ఉపాధి పనులు పరిశీలన**

**నేరడిగొండ:** ఉపాధిహామీ పథకంలో అడిగిన ప్రతిఒక్కరికి పని కల్పించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. నంద్యానాయక్ తండా గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. పనికి హాజరుకాని వారి పేర్లు నమోదు చేసి డబ్బులు అందజేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్ తదితరులు ఉన్నారు.

**ముగిసిన జొన్న కొనుగోళ్లు**

**బోథ్:** బోథ్ మార్కెట్ పరిధిలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగిన జొన్న కొనుగోళ్లు శనివారంతో ముగిశాయి. మార్కెట్ పరిధిలో 2645 మంది రైతుల నుంచి 58,290 క్వింటాళ్ల జొన్న కొనుగోలు చేసినట్లు బోథ్ సహకార సంఘం సొసైటీ సీఈవో గోలి స్వామి తెలిపారు. అయితే మహారాష్ట్ర నుంచి జొన్న పంటను కొనుగోలు చేసి రైతుల పేరిట అమ్మినట్లు తెలుస్తోంది.

**బ్రహ్మేంద్రస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం**

**తాంసి:** తాంసి శివారులో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. హోమం, అర్చన, అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా తయారుచేసిన మహా నైవేద్యాన్ని స్వామివారికి సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాతాజి కిష్టు, సభ్యులు సుభాష్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**అనుమతి లేని పాఠశాలలను మూసివేయాలి**

**ఎదులాపురం:** జిల్లాలో అనుమతి లేకుండా కొనసాగుతున్న పాఠశాలలను గుర్తించి మూసివేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈవో ప్రణీతకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ విద్య పేరుతో స్కూల్ యూనిఫాంలు, అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు నిఖిల్, కార్తీక్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

**పరామర్శ**

**గుడిహత్నూర్:** మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు రాథోడ్ సిద్ధార్థ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లకావత్ రమేశ్, మేస్రం రాము శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. సంఘ కార్యదర్శి జాదవ్ వసంత్‌రావు, ఉట్నూర్ అధ్యక్షుడు రాథోడ్ అజయ్, సభ్యులు జాదవ్ రవికిరణ్, చవాన్ సేవదాస్ తదితరులు ఉన్నారు.

### పోరాటాలకు సిద్ధం కావాలి

**ఎదులాపురం:** తెలంగాణ ఆవిర్భావ వేడుకలు పురస్కరించుకుని అమర వీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జగన్‌సింగ్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని కుమ్రంభీమ్ భవనంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్లు పాలించిన కేసీఆర్ ప్రజల మౌళిక సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. వానాకాలం సీజన్ నేపథ్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు కొడప సురేశ్, దుర్గే బుచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.